సాక్షి వరంగల్

సోమవారం । 12 । ఆగస్టు । 2024



‘ఓపెన్’లో ప్రవేశాలు పొందాలి - 8లో▸

బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ తదితర కోర్సుల్లో ప్రవేశాలు పొందాలని రీజినల్ డైరెక్టర్ జ్యోతి తెలిపారు.



నాన్‌స్టాప్ రైళ్లకు హాల్టింగ్ ఎప్పుడో!

సికింద్రాబాద్ జంక్షన్ తర్వాత అతి ప్రధానమైనది కాజీపేట. అంతటి ప్రాముఖ్యత కలిగిన జంక్షన్‌లో పలు నాన్‌స్టాప్ రైళ్లకు హాల్టింగ్ లేదు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $32^0/23^0$

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

కాళోజీ సెంటర్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ సత్య శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తామని ఆమె పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రజావాణిలో పాల్గొనాలని సూచించారు.

తొమ్మిది మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తొమ్మిది మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. బి.రాజగోపాల్ దుగ్గొండి సర్కిల్ నుంచి పర్వతగిరి సీఐగా, వి.చేరాలు వీఆర్ వరంగల్ నుంచి హసన్‌పర్తి, జె.సురేశ్‌కుమార్ హసన్‌పర్తి నుంచి ఎస్‌బీ వరంగల్, పి.కిషన్ ఎస్‌బీ నుంచి మడికొండ, డి.ప్రతాప్ మడికొండ నుంచి ఎస్‌బీ వరంగల్, కొమ్మూరి శ్రీనివాస్ ఎస్‌బీ వరంగల్ నుంచి వర్ధన్నపేట సర్కిల్, జి.సూర్య ప్రకాశ్ వర్ధన్నపేట సర్కిల్ నుంచి మల్టీజోన్ ఐజీ-1, పులి రమేశ్ వీఆర్ వరంగల్ నుంచి ఎల్కతుర్తి సర్కిల్, ఎ.రాఘవేందర్ ఎస్‌బీ వరంగల్ నుంచి వీఆర్ వరంగల్ అటాచ్డ్ ఎనుమాములకు బదిలీ అయ్యారు.

వ్యక్తి అదృశ్యం




గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ కీర్తినగర్‌కు చెందిన కొంపెల్లి రాజనారాయణ ఈ నెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. ఆయన భార్య లలిత ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ బాబూలాల్ తెలిపారు. 47 ఏళ్ల వయస్సు ఉన్న రాజనారాయణ ఆచూకీ తెలిసిన వారు 87126 85240 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

పాకాలలో పర్యాటకుల సందడి



ఖానాపురం: పాకాలలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సరస్సు మత్తడి పోస్తుండడంతో వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. మత్తడి వద్ద స్నానాలు చేస్తూ సంతోషంగా గడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై రఘుపతి ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేయించి పర్యవేక్షించారు.

నర్సంపేట మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



నర్సంపేట: నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా శాఖమూరి హరిబాబుతోపాటు మరో 16 మంది సభ్యులతో కూడిన పాలకవర్గాన్ని జూలైలో జీఓ నంబర్ 479 ద్వారా ప్రభుత్వం నియమించి ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పాలకవర్గం అంతా ప్రమాణ స్వీకారం చేసింది. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సాంటిరెడ్డి రంజిత్ రెడ్డి, పెండెం రామానంద్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

రామన్నపేట: ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సులైన ఇంజనీరింగ్, కంప్యూటర్ అండ్ కమర్షియల్ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 12న (నేడు) స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తయిన ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్ కాపీతో కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

కేయూ బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బి.నాగరాజు తెలిపారు. ఈనెల 20, 22, 24, 27 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు.

ఏడాదంతా ఆదాయమే..

- రైతులకు సిరులు కురిపిస్తున్న మునగ
- ఎకరాకు ఏడాదిలో రూ.లక్ష ఆదాయం
- అంతర పంటలతో మరింత రాబడి
- జిల్లాలో 41.27 ఎకరాల్లో సాగు



అలంకానిపేటలో మునగ తోటను పరిశీలించిన ఉద్యాన అధికారులు

నెక్కొండ: మునగ.. మునగ ఆకు అంటే నోరూరని వారు ఉండరు. ఎన్నో ఔషధ గుణాలు, పోషక విలువలు ఉన్న మునగ ఒకప్పుడు పెరటి తోటలో ఉండేది. ప్రస్తుతం రైతులకు సిరుల పంటగా మారింది. ఏడాదంతా ఈ పంట సాగులో ఉండడంతో దీన్ని బహువార్షిక పంటగా రైతులు గుర్తించారు. వరి, పత్తి, మొక్కజొన్న సాగుతో రైతులు నష్టపోతున్నారు. పెట్టుబడులు రాక అప్పులపాలవుతున్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగుచేస్తే ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. చివరకు అప్పులే మిగలడంతో రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి మునగ సాగువైపు దృష్టిసారిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో పేరొందిన బహువార్షిక కూరగాయల్లో మునగ ఒకటి. తక్కువ పెట్టుబడి, సంవత్సరమంతా ఆదాయం ఉండడంతో జిల్లాలోని చెన్నారావుపేట, దుగ్గొండి, ఖానాపురం, నర్సంపేట, నెక్కొండ, సంగెం, గీసుకొండ గీసుకొండ మండలాల్లో 41.27 ఎకరాల్లో మునగ పంట సాగుచేస్తున్నారు. ఇక్కడి నుంచి వరంగల్, హైదరాబాద్ మార్కెట్లకు కిలోల చొప్పున రవాణా చేస్తున్నారు. ఎకరాకు రూ.లక్షకుపైగా ఆదాయం సమకూరుతుంది. ఇందులో అంతర పంటలు వేస్తే రైతులకు మరింత రాబడి వస్తుంది.

మొదటి ఏడాదిలోనే దిగుబడి..



మునగ నాటిన మొదటి ఏడాదిలోనే రైతులకు మంచి దిగుబడినిస్తుంది. మునగ మొక్కలు, విత్తనాలు జూలై నుంచి ఆగస్టులో నాటితే జనవరిలో పూతకు వస్తుంది. మార్చి నుంచి జూన్ వరకు పంట చేతికి వచ్చి రైతులకు అందుబాటులో ఉంటుంది. ఎకరంలో మునగ సాగు చేస్తే పెట్టుబడి పోను రూ.70 నుంచి రూ.లక్ష వరకు ఆదాయం పొందవచ్చు. మునగ సాగువైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం.

- తరుణ్, ఉద్యాన అధికారి, నెక్కొండ



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళా రైతుపేరు నీలం మమత. అలంకానిపేట గ్రామానికి చెందిన ఆమె రూ.35 వేల పెట్టుబడితో ఎకరం విస్తీర్ణంలో 600 నుంచి 700 మొక్కలు పెంచుతోంది. ఒక్కో మొక్క నుంచి సీజన్‌లో రూ.600 నుంచి రూ.800 ఆదాయం వస్తుంది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మంచి దిగుబడులు వస్తాయి. ఈ సీజన్‌లో ఒక్కో మునగ కాయ ధర రూ.2 నుంచి రూ.2.50 వరకు పలుకుతుంది. జూన్‌లో పంట పూర్తి కావడంతో అక్కడక్కడ ఉన్న మునగ కాయలకు రూ. 3 నుంచి 3.5 వరకు ధర పలుకుతుంది. ‘ఉద్యాన అధికారుల సూచనలు పాటించి మునగ సాగు చేశాం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వచ్చే మునగ సాగు గురించి తెలుసుకున్నాం. ఎకరంలో మునగ సాగు చేస్తే ఏడాదంతా రాబడి రావడం సంతోషంగా ఉంది. చేను వద్దకే అటు వ్యాపారులు, ప్రజలు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మునగ విత్తనాలు మా వద్ద దొరుకుతాయి. వీటికి మంచి డిమాండ్ ఉంది. ఎకరానికి రూ.లక్షపైగా ఆదాయం వస్తోంది’ అని మమత చెబుతోంది.




ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు నల్లపు యతిన్. అప్పల్ రావుపేటకు చెందిన ఈయన మునగ సాగు చేసి అద్భుత విజయాలు సొంతం చేసుకున్నాడు. 5 అడుగుల నుంచి 9 అడుగుల దూరంతో ఒక మొక్క ఉండేవిధంగా ఎకరం భూమిలో 1000 మునగ మొక్కలు నాటాడు. ఇందులో అంతర పంటలుగా దోస, పొట్లకాయ సాగు చేస్తున్నాడు. మునగ, అంతర పంటల సాగుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల పెట్టుబడి అయ్యింది. ‘మునగ సాగుతో రూ.లక్ష రాబడి రాగా.. అంతర పంటలకు మరో రూ.50 వేల ఆదాయం ఒక సీజన్‌లో వచ్చింది. అంతర పంటలు వేసుకుంటే ఎక్కువ ఆదాయం వస్తుంది. సీజన్‌లో కిలో మునగ రూ.30 నుంచి రూ.40 వరకు ధర పలుకుతుంది. పంట చివరి దశకు చేరుకునే సమయంలో రూ.60 నుంచి రూ.70 వరకు వ్యాపారులు కొనుగోళ్లు చేస్తరు. ఆదాయం పొందడానికి సంప్రదాయ పంటలకు బదులు మునగ, ఇతర ఉద్యాన పంటలను సాగు చేసేలా రైతులను అధికారులు ప్రోత్సహించాలి’ అని యతిన్ సూచిస్తున్నాడు.

కోటకు మహర్దశ..!

మంత్రి సురేఖ పర్యటనతో చిగురిస్తున్న ఆశలు

- ఖిలావరంగల్ అభివృద్ధికి అడుగులు
- పురాతన ఆలయాల పునరుద్ధరణకు చర్యలు
- రాతికోట చుట్టూ గార్డెనింగ్, అగర్త చెరువులో బోటింగ్
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు



రాతికోట చుట్టూ అభివృద్ధి చేయనున్న చెరువు

ఖిలా వరంగల్: కాకతీయుల రాజధాని ఖిలావరంగల్ కోటకు మహర్దశ పట్టనుంది. ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకునే స్థాయిలో అభివృద్ధి చెందనుంది. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పర్యటనతో ఆశలు చిగురిస్తున్నాయి. ఎంపిక చేసిన పురాతన ఆలయాలను అభివృద్ధి చేసి కోటకు కొత్త అందాలు తీసుకురానున్నట్లు ఆమె ప్రకటించారు. రాతి కోట చుట్టూ ఉన్న అగర్త చెరువుల్లో బోటింగ్ సదుపాయం కల్పించనున్నారు. పర్యాటకులు బోటులో షికారు చేస్తూ శిల్ప కళా సంపదను తిలకించే అవకాశం దగ్గరలోనే ఉంది.

సిద్ధమవుతున్న ప్రతిపాదనలు..

చారిత్రక కోటలో ఇప్పటి వరకు గుండు చెరువుకే పరిమితమైన బోటింగ్ రాతి కోట చుట్టూ ఉన్న అగర్త చెరువులో కల్పించనున్నారు. ఇటీవల కలెక్టర్ సత్య శారదతో కలిసి మంత్రి కొండా సురేఖ మధ్య కోటలో పర్యటించారు. అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించగా.. రెవెన్యూ, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ సైతం కోటలో ఇటీవల పర్యటించారు. పురాతనమైన 14 ఆలయాలతోపాటు శంభునిగుడిని పరిశీలించారు. కోట అభివృద్ధి, రాతికోట, అగర్త చెరువులో బోటింగ్‌కు సంబంధించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని ప్రకటించారు. ఇందులో ప్రధానంగా రాతికోటలపై ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, పర్యాటకులు సేద దీరేందుకు చైర్లు, టీ స్టాల్స్, సాయంత్రం వేళ్ల ఆహ్లాదకర వాతావరణంలో విహరించడానికి గ్రీనరీ, అలాగే రాతికోట మెట్ల మార్గంపై సుందరీకరణ, హోటల్, టీస్టాల్స్, విశ్రాంతి గదుల నిర్మాణం తదితర సదుపాయాలు కల్పించడానికి ‘కుడా’ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పర్యాటక ప్రదేశాల అభివృద్ధిపై మంత్రి కొండా సురేఖ ప్రత్యేకంగా దృష్టి సారించారు.

రాతికోటకు పూర్వవైభవం..

కాకతీయ సామ్రాజ్యంలో శత్రు దుర్భేద్యమైన ఏడు కోటలను నిర్మించారు. నగర విస్తీర్ణంతో 800 ఏళ్ల చరిత్ర కలిగిన కట్టడాలు కాలగర్భంలో కలిసిపోయాయి. మిగిలిన మూడు కోటల్లో ఒకటి నగరం చుట్టూ పుట్టకోట అక్కడక్కడా కనిస్తుంది. మరో రెండు మట్టి, రాతి కోటలు ఖిలావరంగల్ చుట్టూ కనిపిస్తాయి. చారిత్రక సంపదను కాపాడి భావితరాలకు అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తూనే ఉన్నాయి. మట్టికోట 7 కిలోమీటర్లు, రాతికోట చుట్టుకొలత 4,365 మీటర్లు, వ్యాసం 4.5 కిలోమీటర్లు విస్తరించి ఉంటుంది. రాతికోట చుట్టూ బండి దర్వాజ, మచ్లీ దర్వాజ, సీనా దర్వాజ, హైదర్ దర్వాజాలు ఉన్నాయి. 75 బురుజులతో నల్లరాతితో నిర్మించిన కోట గోడలు పర్యాటకులను అలరిస్తున్నాయి. కోట అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. శత్రువులు రాజధానిలోకి రాకుండా రాతికోట చుట్టూ ఏర్పాటు చేసిన అగర్త చెరువులో నాడు మొసళ్లను పెంచగా.. నేడు ఆ చెరువులో రాష్ట్ర ప్రభుత్వం బోటింగ్ షికారుతోపాటు చేపల పెంపకం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈ బోటింగ్ ద్వారా రాతికోట పూర్వ వైభవాన్ని పర్యాటకులు వీక్షించే అవకాశం ఉంది.

పీఏసీఎస్‌లో పోలీసుల విచారణ



పీఏసీఎస్‌లో విచారణ చేస్తున్న సీఐ రాజగోపాల్

నల్లబెల్లి: మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో పంట రుణాలు, రుణాల రెన్యువల్, రుణమాఫీ జాబితా తయారీలో అక్రమాలకు పాల్పడిన సీఈఓ నాగెల్లి మొగిలి, చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, కంప్యూటర్ ఆపరేటర్ వైనాల రాజుపై కేసు నమోదు చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నర్సంపేట రూరల్ సీఐ రాజగోపాల్ ఆదివారం తన సిబ్బందితో కలిసి పీఏసీఎస్ కార్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. సహకారం సంఘంలో పంట రుణాలు తీసుకున్న వారి వివరాలను అసిస్టెంట్ ఇన్‌చార్జ్ సీఈఓ ఎల్లన్నను అడిగి తెలుసుకున్నారు. సంఘంలో పంట రుణాలు, రుణాల రెన్యువల్, రుణమాఫీ జాబితా తయారీలో జరిగిన అక్రమాలపై చర్చించారు. కార్యాలయానికి చేరుకున్న కొందరు రైతులు తాము పంట రుణాలు తీసుకోలేదని, పీఏసీఎస్ సిబ్బంది అక్రమాలకు పాల్పడి తమకు అప్పు ఉన్నట్లు రికార్డులు సృష్టించారని సీఐకి వివరించారు. రికార్డులను పరిశీలించి, విచారణ పూర్తిచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్సైలు ప్రశాంత్‌బాబు, వెంకటేశ్వర్లు, రఘుపతి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చింతలపల్లి సొసైటీలో అక్రమాలు

- ఫోర్జరీ సంతకాలతో సిబ్బంది వేతనాలు స్వాహా చేసిన సీఈఓ!
- రైతులు చెల్లించిన రుణాలు ఖాతాలో జమచేయని అధికారి
- లోన్స్ రెన్యువల్ చేయకపోవడంతో వర్తించని రుణమాఫీ
- డీసీఓకు సేల్స్‌మెన్ ఇటీవల ఫిర్యాదు

సంగెం: రైతులకు సకాలంలో రుణాలు, విత్తనాలు, ఎరువులు అందించాల్సిన చింతలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ సొసైటీలో 644 మంది రైతులు ఉన్నారు. రైతులు తీసుకున్న రూ.3 కోట్ల రుణాలు రెన్యువల్ చేయకపోవడంతో రుణమాఫీ వర్తించలేదు. రైతులు చెల్లించిన రుణాలు, ముగ్గురు సిబ్బందికి చెల్లించాల్సిన వేతనాలు ఫోర్జరీ చేసి సీఈఓ సొంతానికి వాడుకున్నాడని సేల్స్‌మెన్ దాసరి మల్లికార్జున్ ఇటీవల డీసీఓకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా మల్లికార్జున్ పేర జీతం డబ్బులు రూ.1,27,500తో పాటు మరో ఇద్దరికి సంబంధించిన వేతనాలు ఫోర్జరీ చేసి వాడుకున్నాడు. 2022-23లో ఎరువుల వ్యాపారంలో వచ్చిన రూ.3,33,305, ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా వచ్చిన కమీషన్, రేషన్ బియ్యం అమ్మగా వచ్చిన కమీషన్ సైతం సొసైటీ ఖాతాలో జమ చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సొసైటీలో అక్రమాలపై చైర్మన్ బొమ్మగాని వెంకటేశ్వర్లును ‘సాక్షి’ వివరణ కోరగా ఫోర్జరీ సంతకాలు చేసి సిబ్బంది జీతాలు వాడుకున్నట్లు సీఈఓ ఒప్పుకున్నాడని, రికవరీ చేసి సిబ్బందికి న్యాయం చేస్తామని తెలిపారు.

ఏసీబీ డైరెక్టర్ పూజలు



ఐనవోలు/హన్మకొండ కల్చరల్: తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) డైరెక్టర్ తరుణ్‌జోషి ఆదివారం ఐనవోలు మల్లికార్జునస్వామిని, అలాగే వరంగల్‌లోని శ్రీభద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

‘డబుల్ ఇస్మార్ట్’ సందడి



అభివాదం చేస్తున్న సినీహీరో రామ్

హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఎదురుగా ఉన్న ఇండోర్ స్టేడియంలో ‘డబుల్ ఇస్మార్ట్ శంకర్’ సినీ బృందం ఆదివారం సందడి చేసింది. సినిమా ప్రీరిలీజ్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. హీరో రామ్ పోతినేని, దర్శకుడు పూరి జగన్నాథ్, హీరోయిన్ కావ్య, చార్మి, నటుడు అలీ, యాంకర్ సుమ, చిత్ర బృందం హాజరైంది. ఈ సందర్భంగా సినిమా హీరో రామ్ పోతినేని మాట్లాడుతూ ‘ఇస్మార్ట్ శంకర్ సినిమా ప్రీరిలీజ్ కోసం వరంగల్‌కు వచ్చా.. మళ్లీ ఐదేళ్ల తర్వాత ఇప్పుడు వచ్చా.. అదే ఎనర్జీతో ఉన్నారు. ఎవరో చెప్పిన మాటలు పక్కన పెట్టి మీరు స్వయంగా సినిమాను చూసి ఆనందించండి’ అని పేర్కొన్నారు.

– హన్మకొండ చౌరస్తా

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేకు సన్నద్ధం

- విద్యార్థుల్లో సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఎన్ఎఎస్
- ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ



ఎన్ఏఎస్ కాంప్లెక్స్ హెచ్ఎంల శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి (ఫైల్)



నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే లోగో

కాళోజీ సెంటర్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను గుర్తించేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) చేపట్టేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థుల ప్రగతిని అంచనా వేయడానికి హిందీ మినహా అన్ని సబ్జెక్టుల్లో మూడు సంవత్సరాలకోసారి సర్వే చేస్తారు. విద్యార్థుల గుణాత్మక విద్యాసాధన మాత్రమే కాకుండా పాఠశాలల్లోని వసతులు, బోధన సిబ్బంది, ఉపాధ్యాయుల వృత్త్యంతర శిక్షణ, బోధన అభ్యసన ప్రక్రియ, సహపాఠ్యాంశాల కార్యక్రమాలను కూడా ఈ సర్వేలో పరిశీలించి వివరాలు నమోదు చేస్తారు.

సర్వేలో వినియోగించే ప్రశ్నావళి..

- పీక్యూ (పబ్లిక్ క్వశ్చన్స్) విద్యార్థుల ప్రశ్నావళి
- ఎస్‌క్యూ (స్కూల్ క్వశ్చన్స్) పాఠశాల ప్రశ్నావళి
- టీక్యూ (టీచర్స్ క్వశ్చన్స్) ఉపాధ్యాయుల ప్రశ్నావళి

ఈ ప్రశ్నావళి ఆధారంగా ప్రస్తుత పరిస్థితులను బోధన, విద్యార్థులు, మౌలిక వసతులు, బోధన సిబ్బంది పరంగా నివేదిక రూపొందిస్తారు. సర్వేలోని ఫలితాల ఆధారంగా నూతన బోధన అభ్యసన ఫలితాల రూపకల్పనకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా సిబ్బంది అవసరాలు, అదనపు బోధకుల నియామకం, అదనపు వసతులు కల్పించేందుకు ఒక నిర్ణయం తీసుకుంటారు. జాతీయ సగటులో మన రాష్ట్రం, మన జిల్లా గుణాత్మక విద్యలో ఎలా ఉంది, మెరుగైన స్థానాన్ని పొందాలంటే ఏ విధానాలను అవలంబించాలనే అంశాలపై దృష్టి సారించవచ్చు అనే కోణంలో సిద్ధమవుతున్నారు.

గత సర్వేలో జిల్లాకు 24వ స్థానం..

2021 నవంబర్‌లో నిర్వహించిన సర్వే ఆధారంగా తెలంగాణ రాష్ట్రం సగటు పీక్యూ, ఎస్‌క్యూ, టీక్యూలో 59వ స్థానంలో ఉంది. సర్వే ప్రకారం దేశంలో చివరి నుంచి ఐదో స్థానంలో ఉంది. వరంగల్ జిల్లా మాత్రం 24వ స్థానంలో ఉంది. ఇప్పుడు శిక్షణ పొందిన కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులను ఎన్ఏఎస్‌కు సమాయత్తపరిచి జిల్లాను రాష్ట్రంలో ముందుంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎన్ఏఎస్‌కు సిద్ధం చేస్తున్నాం..



నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్)లో జిల్లాను మొదటి వరుసలో ఉంచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. ఎన్ఏఎస్‌కు ఒక ప్రత్యేక ప్రశ్నావళి రూపొందించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తాం. సర్వే నవంబర్ లేదా డిసెంబర్‌లో ఉంటుంది. గతం కంటే మెరుగైన స్థానంలో వచ్చేందుకు కృషిచేస్తాం.

- డి.వాసంతి, డీఈఓ

శాస్త్రీయంగా ఆలోచిస్తేనే అభివృద్ధి : రిజిస్ట్రార్



మాట్లాడుతున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

హన్మకొండ: ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకుని శాస్త్రీయంగా ఆలోచించినప్పుడే భారత్ అభివృద్ధి చెందుతుందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. హనుమకొండ కిషన్‌పురలోని వాగ్దేవి కళాశాలలో జనవిజ్ఞాన సమితి హనుమకొండ జిల్లా కమిటీ 5వ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈసభలో కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే అట్టడుగు వర్గాలకు శాస్త్ర సాంకేతిక ఫలాలు చేరాలన్నారు. ప్రధానవక్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. ఇప్పటికీ మూఢనమ్మకాలు ప్రబలుతున్నాయని, జనవిజ్ఞాన వేదిక ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నిట్ విశ్రాంత ఆచార్యులు రామచంద్రయ్య ‘శాస్త్రీయ దృక్పథం-ప్రస్తుత ఆవశ్యకత’ అంశంపై, విశ్రాంత అటవీ శాఖ అధికారి పురుషోత్తం ‘అవయవ దానం-సామాజిక బాధ్యత’ అంశంపై, విశ్రాంత ఆచార్యులు కె.లక్ష్మారెడ్డి జనవిజ్ఞాన వేదిక ఆశయాలు కార్యక్రమాలపై, ఏసీపీ విజయకుమార్ ప్రజలు సైబర్ నేరస్తుల చేతిలో చిక్కకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఆచార్య కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈమహాసభలో డాక్టర్ శ్రీనివాస్ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

నూతన చట్టంతో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

కాళోజీ సెంటర్ : నూతన ఆర్ఓఆర్ చట్టంతో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ ముసాయిదా బిల్లు- 2024పై ఆదివారం చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా రెవెన్యూ ఉద్యోగులు, న్యాయవాదులు, రైతులు పాల్గొని రెవెన్యూ చట్టంలోని అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ చట్టంతో రైతులకు తహసీల్దార్, ఆర్డీఓ, అదనపు కలెక్టర్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. రెవెన్యూ కోర్టులను రద్దు చేయడంతో అప్పీలు చేసుకునేందుకు వీలులేక రైతులు హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ కార్యాలయానికి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. 18 రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను సమగ్రంగా అధ్యయనం చేసి నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. ముసాయిదా బిల్లుపై రైతులు, ఉద్యోగుల అభిప్రాయాలను తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే సాధ్యం అని అన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాక రమేశ్, పూల్ సింగ్, అసోసియేట్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఇక్బాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విక్రంకుమార్, టీజీటీఏ మహిళా అధ్యక్షురాలు రాధ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేశ్వర్‌రావు, జ్యోతి, విజయ్‌సాగర్, వీఆర్ఓల సంఘం నాయకులు గూడె శ్రీను, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బురహాన్‌పల్లిలో వేలాడుతున్న విద్యుత్ తీగలు



బురహాన్‌పల్లి శివారులో వేలాడుతున్న విద్యుత్ తీగలు

రాయపర్తి: వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని బురహాన్‌పల్లి శివారు నుంచి జానకమ్మబండతండా దాకు వెళ్లే రహదారిలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. రహదారి సమీపంలో మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ఆదర్శ వివాహం అభినందనీయం



ఆదర్శ దంపతులతో నేతలు

న్యూశాయంపేట: తెలంగాణ మహిళా సమాఖ్య నాయకురాలు నేదునూరి జ్యోతి తన కూతురికి ఆదర్శ వివాహం చేయడం అభినందనీయం.. ఇలాంటి వివాహాలతోనే సామాజిక పరివర్తన సాధ్యమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ఆదివారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో జ్యోతి రాజమౌళి కూతురు అపూర్వ –శ్రీధర్ ఆదర్శ వివాహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, సీపీఐ నాయకులు పల్లా వెంకట్ రెడ్డి, టి.శ్రీనివాస్‌రావు, వివిధ జిల్లాల కార్యదర్శులు రాజారెడ్డి, విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతికి నృత్య కళలు దోహదం

- రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు దీపిక
- కార్మికుల పిల్లలకు నృత్య ప్రదర్శన పోటీలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న దీపిక ప్రశాంత్ కృష్ణ సాయి

కాజీపేట రూరల్: భారతీయ సంస్కృతి అభివృద్ధికి నృత్యకళలు ఎంతగానో దోహదపడతాయని రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కాజీపేట అధ్యక్షురాలు దీపిక ప్రశాంత్‌కృష్ణసాయి అన్నారు. రైల్వే కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వే కార్మికుల పిల్లలకు నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. కూచిపూడి, భరత నాట్యం, జానపద నృత్యాలతో పాటు వెస్ట్రన్ నృత్యాలు, చెస్, నాటికల పోటీలను ఆర్.దీపిక ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ప్రశాంత్ కృష్ణసాయి, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కోశాధికారి జి.రాజేశ్వర్, కల్చరల్ ఆర్గనైజర్ ధారవత్ రఘు, సభ్యులు ఎస్.ప్రవీణ్, పి.ప్రశాంత్, పి.రవికిరణ్, ఎం.మహేశ్, కరణ్‌సింగ్, సదానందం, గోపాల్, సాంబరాజు, రైల్వే కార్మికులు, వారి పిల్లలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌పై కేసు నమోదు

రామన్నపేట : వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తోపాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపి ఆదివారం తెలిపారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పసిపాపను కుక్కలు తిన్న ఘటనపై పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా శనివారం మధ్యాహ్నం ఎంజీఎం ఓపీ గేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారన్నారు. అధిక సంఖ్యలో జనాలు గుమిగూడడంతో రోగులకు ఇబ్బందులు కలిగిన నేపథ్యంలో అదేరోజు రాత్రి నరేందర్‌తోపాటు పలువురిపై (సీఆర్ నంబర్ 279/2004యూ/ఎస్ 170బీఎన్ఎస్ఎస్) నూతన చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు వివరించారు. కేసు నమోదైన వారిలో మాజీ ఎమ్మెల్యే నరేందర్, కార్పొరేటర్ కుమారస్వామి, మరుపల రవి, రిజ్వాన్, మాజీ కార్పొరేటర్ కొంగర రాజేందర్, దుర్గేశ్వరస్వామి దేవాలయ మాజీ చైర్మన్ ఎలగంటి సతీశ్, ఎలగంటి మధు, సీతారాం, బజ్జూరి వాసు, తోట స్రవంతి ఉన్నట్లు పేర్కొన్నారు.

వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ ‘వెల్‌నెస్’ సెంటర్

- ఇక హైదరాబాద్‌కు వెళ్లే తిప్పలు తప్పినట్టే
- ఐదేళ్లుగా చేస్తున్న కృషికి దక్కిన ఫలితం
- బీఎల్ వర్మ చొరవతో సానుకూలంగా అడుగులు
- పార్లమెంట్‌లో వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య గళం
- ఉత్తర తెలంగాణలోని ఉద్యోగులకు జరగనున్న లబ్ధి



ఎంపీ కడియం కావ్యతో సీజీహెచ్‌ఎస్ పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు

సాక్షి, వరంగల్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన పెన్షనర్ల ఆరోగ్యం కోసం వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్‌ఎస్) వెల్‌నెస్ సెంటర్ మంజూరు కోసం చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. కొందరు ఉద్యోగులు, పెన్షనర్లు బృందంగా ఏర్పడి 2019 నుంచి ఇప్పటివరకు కేంద్ర మంత్రులు, ఎంపీలకు వినతిపత్రాలు ఇస్తూ.. తమ ఇబ్బందులను వివరించారు. అదే సమయంలో న్యూఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం కార్యాలయ అధికారులను కలిసి అభ్యర్థించారు. ఎట్టకేలకు వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. దేశవ్యాప్తంగా సుమారు 22 కేంద్రాలకు వెల్‌నెస్ సెంటర్‌లు మంజూరుకాగా.. అందులో వరంగల్‌కు చోటు దక్కింది. భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా 2023 డిసెంబర్‌లో వరంగల్‌కు వచ్చిన కేంద్ర మంత్రి బీఎల్ వర్మకు ఇచ్చిన రిప్రజెంటేషన్‌తో దీనిపై కదలిక వచ్చింది. ఇటీవల పార్లమెంట్‌లో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సైతం వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు అంశం లేవనెత్తడంతో ఆ దిశగా మార్గం సుగమమైంది.

హైదరాబాద్‌కు వెళ్లే తిప్పలు తప్పినట్టే..

తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఎంపీలు, స్వాతంత్య్ర సమరయోధులు, మాజీ మంత్రులకు ఈ వెల్‌నెస్ సెంటర్ ద్వారా ప్రయోజనం కలుగనుంది. అయితే రాష్ట్రంలో ఒక్క హైదరాబాద్‌లోనే 13 కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్వస్థియా సదన్‌లు (ఆరోగ్య కేంద్రం) ఉండడంతో అన్ని జిల్లాల నుంచి ఆరోగ్యం విషయంలో అక్కడికి వెళ్లేవారు. వందల కిలోమీటర్లు ప్రయాణించి ఏళ్లుగా వెతలు పడుతున్నాడు. ముఖ్యంగా 60 ఏళ్లు దాటిన పెన్షనర్లు బీపీ, షుగర్, కార్డియాక్, కిడ్నీ, లివర్ తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతూనే హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడికి వెళ్లాక ఎంప్యానల్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. అయితే ముందు డబ్బు కట్టించుకొని వైద్యం చేశాక క్లైయిమ్ చేసుకొమనే పరిస్థితి ఉంది. చాలామంది పెన్షనర్లు రూ.లక్షల బిల్లు కట్టలేని పరిస్థితి ఉంది. అయితే ఇప్పుడూ వరంగల్‌లోనే వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుతో ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండతో పాటు మెదక్, ఆదిలాబాద్‌లోని కొన్ని ప్రాంతాల వారికి ఉపయుక్తం కానుంది. అదే సమయంలో వరంగల్‌లో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఎంప్యానల్ అయితే వీరికి మరింత ఉపయోగపడుతుంది. తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల్లో క్యాష్ లెస్ ట్రీట్ మెంట్ ఉంటుందని పేర్కొనడం ఆనందంగా ఉందని, ఇది క్షేత్రస్థాయిలో అమలైతే చాలా మందికి ప్రయోజనం చేకూరుతుందని భారతీయ పోస్టల్ పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు ఎస్.సదానందం అన్నారు.

ఎంపీ కావ్యకు కృతజ్ఞతలు

వరంగల్‌కు సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేయాలని పార్లమెంట్‌లో లేవనెత్తిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యను హనుమకొండలోని తన నివాసంలో సీజీహెచ్‌ఎస్ పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ..‘దేశవ్యాప్తంగా 22 నగరాల్లో వెల్‌నెస్ సెంటర్‌లు మంజూరయ్యాయి. ఇందులో వరంగల్ కూడా ఉంది. దీంతో ఉత్తర తెలంగాణలో ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఆరోగ్య సేవలు అందించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనిద్వారా వైద్య చికిత్సలు, వ్యాధి నిర్ధారణ తదితర సదుపాయాలు కలగడంతో ఉద్యోగులకు, ఉద్యోగ కుటుంబాలకు వైద్య ఆరోగ్య సంబంధిత సౌకర్యం లభిస్తుంద’ని తెలిపారు.

భారం కావొద్దని బలవన్మరణం..

- ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య
- రాయపర్తిలో ఘటన



కొంరయ్య(ఫైల్)

నడికూడ: వృద్ధాప్యంలో ఎవరికీ భారం కావొద్దనే ఉద్దేశంతో ఓ వృద్ధుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని రాయపర్తిలో చోటుచేసుకుంది. పరకాల పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాసమల్ల కొంరయ్య(80), సమ్మక్క దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వీరందరికీ వివాహం చేశారు.రెండు సంవత్సరాల క్రితం సమ్మక్క మృతి చెందింది. కొంరయ్య ప్రస్తుతం ఒంటరి జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో వృద్ధాప్యంలో ఉన్న తాను ఎవరికీ భారం కావొద్దనే ఉద్దేశంతో ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో కొత్తకొండలో యువకుడు..



రంజిత్‌కుమార్ (ఫైల్)

ఎల్కతుర్తి: తన తండ్రి 10 ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో ఇంటికి తానే పెద్ద దిక్కయ్యాడు. ఇంటి నిర్మాణం కోసం, తన అక్క పెళ్లి కోసం సుమారు రూ. 8లక్షలు వరకు అప్పు చేశాడు. ఈ అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో చోటు చేసుకుంది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన మారుపాక రంజిత్‌కుమార్ (30) తండ్రి పదేళ్ల క్రితం చనిపోయాడు. దీంతో ఇంటికి తానే పెద్దదిక్కుగా మారాడు. తన అక్క శైలజకు వివాహం చేశాడు. వివాహం కోసం కొంత అప్పు చేయగా ఇంటి నిర్మాణం కోసం మరికొంత చేశాడు. మొత్తం రూ. 8లక్షల వరకు అప్పు అయింది. అప్పు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర కొంతకాలంగా తల్లితోపాటు స్నేహితులకు చెబుతూ మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి కళావతి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హనుమకొండలో గుర్తు తెలియని యువకుడు..



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

వరంగల్ క్రైం: హనుమకొండ పీఎస్ పరిధిలోని జీఎన్ఎస్ గార్డెన్ ప్రాంతంలో గుర్తు తెలియని యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వయసు 30–35 సంవత్సరాలు ఉంటుంది. ఆరెంజ్ కలర్ టీషర్ట్ ధరించాడు. చేతికి టాటూ ఉంది. ఉంగరం కలిగి ఉన్నాడని ఇన్‌స్పెక్టర్ సతీశ్ తెలిపారు. మృతుడి సమాచారం తెలిస్తే ఇన్‌స్పెక్టర్ సతీశ్ 8712685113, ఎస్సై సతీశ్ 9493789321 నంబర్లకు ఫోన్ చేయాలని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



సోమయ్య (ఫైల్)

నెల్లికుదురు: విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఇనుగుర్తి మండలం చిన్నముప్పారంలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దర్శనం సోమయ్య (60) తన వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బాట(రోడ్డు)లో ఉన్న జేవైరు తాకి విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

పని చేస్తూనే పరలోకాలకు..

- ఫిట్స్‌తో పొలంలోనే ప్రాణం వదిలిన రైతు
- కొత్తూరు(సీ) గ్రామంలో ఘటన



బక్కయ్య(ఫైల్)

కురవి: ఓ రైతు పనిచేస్తూనే పరలోకాలకు చేరాడు. ఫిట్స్ (మూర్ఛ)తో పొలంలోనే ప్రాణం వదిలాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కొత్తూరు (సీ) గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు మలిశెట్టి బక్కయ్య (46) ఆదివారం తన పొలం వద్దకు వెళ్లాడు. పనిచేస్తుండగానే ఫిట్స్ వచ్చాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని పక్కన రైతులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. వెంటనే గ్రామస్తులు, కుటుంబసభ్యులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ఇంటికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బక్కయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

పర్వతగిరి సీఐ, వీఆర్ ఎస్సై సస్పెన్షన్

వరంగల్ క్రైం/పర్వతగిరి: పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇ.శ్రీనివాస్‌నాయక్‌తోపాటు గతంలో ఐనవోలు ఎస్సైగా విధులు నిర్వహించి ప్రస్తుతం వీఆర్ ఎస్సైగా కొనసాగుతున్న జి.అనిల్‌కుమార్‌పై ఓ కేసులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో పోలీస్ కమిషనర్ విచారణకు ఆదేశించారు. ఈఘటనపై అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా అవినీతికి పాల్పడిన పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, వీఆర్ ఎస్సై అనిల్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

‘ఓపెన్’లో ప్రవేశాలు పొందాలి

- అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వరంగల్ రీజినల్ డైరెక్టర్ జ్యోతి



మాట్లాడుతున్న అంబేడ్కర్ వర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ జ్యోతి

కేయూ క్యాంపస్ : 2024–2025 విద్యాసంవత్సరానికి సంబంధించి బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు, పీజీ ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, బీఎల్ఐఎస్సీ ఎంఎల్ఐఎస్సీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు పొందాలని ఆ యూనివర్సిటీ వరంగల్ రీజినల్ డైరెక్టర్ , యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి తెలిపారు. ఆదివారం హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 31వరకు అడ్మిషన్లు పొందేందుకు గడువు ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని స్టడీసెంటర్లలో ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు విద్యార్హతలు, ఫీజులు ,కోర్సుల తదితర వివరాలన్నీ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ ఆన్‌లైన్.ఇన్‌లో పొందొచ్చని వెల్లడించారు. ఇప్పటికే డిగ్రీకోర్సుల ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. పూర్తిసమాచారం సమీపంలోని అధ్యయన కేంద్రాలు, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం హెల్ప్‌డెస్క్ నంబర్ 7382929570ను సంప్రదించాలన్నారు. 18005990101 టోల్ ఫ్రీ నంబర్‌లో కూడా సంప్రదించొచ్చని తెలిపారు. డిగ్రీ, పీజీ ఓల్డ్ బ్యాచ్ విద్యార్థులు రెండో, మూడో సంవత్సరంలో ఫీజు సకాలంలో చెల్లించలేక పోయినవారు 2015–2016 విద్యాసంవత్సరం నుంచి 2023–2024 వరకు అడ్మిషన్ పొంది ఉంటే నెట్ బ్యాంకింగ్ /క్రెడిట్/డెబిట్ కార్డు లేదా టీఎస్ ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు చివరి గడువు ఈనెల 18 అని తెలిపారు. ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పుల్లారమేశ్, అధ్యాపకులు చారి, గిరిప్రసాద్, నహీదా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

నాన్‌స్టాప్ రైళ్లకు హాల్టింగ్ ఎప్పుడో!

- కాజీపేట జంక్షన్‌ను పట్టించుకోని ఎంపీలు, మంత్రులు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



కాజీపేట జంక్షన్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్.. ఉత్తర, దక్షిణ భారత కూడలి. నిత్యం సుమారు 90 రైళ్లు, వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రాంతం. ఇంత ప్రాముఖ్యత కలిగిన ఈ రైల్వే జంక్షన్‌లో నాన్‌స్టాప్ రైళ్లకు హాల్టింగ్ లేదు. తెలంగాణలో సికింద్రాబాద్ జంక్షన్ తర్వాత అతిప్రధానమైనది కాజీపేట. అయినా ఈ రైల్వే స్టేషన్ మీదుగా కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకుండా వెళ్తున్నాయి. కాజీపేట జంక్షన్ నుంచి వివిధ ప్రాంతాలకు నిత్యం దాదాపు 10 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. రోజూ సుమారు 90 రైళ్లు అప్ అండ్ డౌన్ రూట్‌లో ప్రయాణిస్తుంటాయి. రోజు దాదాపు రూ.15 లక్షల ఆదాయం సమకూర్చుకుంటుంది.

కాజీపేట జంక్షన్‌లో ఆగని రైళ్లు ఇవే..

సికింద్రాబాద్–విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్, నిజాముద్దీన్–యశ్వంత్‌పూర్ కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–విశాఖపట్నం గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, బెంగళూర్–టాటానగర్ టాటానగర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–హజరత్ నిజాముద్దీన్ దురంతో ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–షాలిమార్ షాలిమార్ రైళ్లకు కాజీపేట జంక్షన్‌లో హాల్టింగ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే సికింద్రాబాద్–తిరుపతి పద్మావతి ఎక్స్‌ప్రెస్‌తో పాటు మరికొన్ని వీక్లీ రైళ్లను డైలీ ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా నడపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎంపీలు, మంత్రులు పట్టించుకోవాలి..

కాజీపేట–హడప్సర్‌కు ట్రైవీక్లీగా నడుస్తున్న హడప్సర్ ఎక్స్‌ప్రెస్, బై వీక్లీగా నడుస్తున్న కాజీపేట–పూణె ఎక్స్‌ప్రెస్‌ను డైలీ ఎక్స్‌ప్రెస్‌గా నడిపించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. కాజీపేట జంక్షన్ మీదుగా వెళ్లే నాన్‌స్టాప్ రైళ్లకు ఇక్కడ హాల్టింగ్ కల్పించి బైవీక్లీ, ట్రైవీక్లీ రైళ్లను డైలీ ఎక్స్‌ప్రెస్‌లుగా నడిపిస్తే దూరప్రాంతాలకు వెళ్లేవారికి రిజర్వేషన్ అందుబాటులో ఉండడంతోపాటు కాజీపేట జంక్షన్ ప్రాధాన్యం పెరుగుతుందని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఎంపీలు, మంత్రులు పట్టించుకుని రైల్వే బోర్డు, రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తీసుకురావాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఉర్దూ భాషను రక్షించుకోవాలి

- కవి సమ్మేళనంలో పలువురు వక్తలు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

న్యూశాయంపేట : ఉర్దూ భాషను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. వరంగల్ మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో ఉర్దూ కవి (ముషైరా) సమ్మేళనం –ఉర్దూ రచయితలు రచించిన పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన కవులు, రచయితలు తమ కవితలతో సభికులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్‌కు చెందిన ఉర్దూ రచయితలు మసూద్ మీర్జా మైషర్ (కరబ్ ఆఘా), నాసిర్ వాహిదీ(మహేక్ అఫ్కార్‌కీ) రచయిత్రి డాక్టర్ ఆమేనా అఖ్తర్ (వరంగల్ కా షేరో అదబ్) రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్దిఖీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయితలు డాక్టర్ మోహసిన్ జలస్ గాన్వీ, డాక్టర్ ఫారూఖ్ షకీల్, సర్దార్ సలీం, అంజనీకుమార్ గోయల్, జఫర్‌ఫారూఖీ, డాక్టర్ రహీం రామేశ్, డాక్టర్ నయీం సలీం, అమ్జద్ సలీం అమ్జత్, ఫైసల్ వారిసీ, రాహెల్‌తో పాటు బహదూర్‌అలీ, డాక్టర్ రజామాలిక్, ఎంఏ.కలీం, సయ్యద్ అక్బర్, ఉర్దూ భాషాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాయపర్తిలో చైన్‌స్నాచింగ్..

- బైక్‌పై వెళ్తున్న మహిళ చేతిలోని బ్యాగు లాక్కెళ్లిన దుండగుడు
- బ్యాగులో తులం బంగారం భద్రపరిచి తీసుకెళ్తుండగా ఘటన



బాధిత మహిళ భవిత

రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రం శివారులో ఆదివారం చైన్‌స్నాచింగ్ జరిగింది. దంపతులు బైక్‌పై ప్రయాణిస్తుండగా మరో బైక్‌పై వచ్చిన దుండగుడు.. మహిళ చేతిలో ఉన్న బ్యాగును అపహరించాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం వడ్డేకొత్తపల్లి గ్రామానికి చెందిన సాయిని వెంకన్న, భవిత దంపతులు బైక్‌పై వర్ధన్నపేట వైపు నుంచి తొర్రూరు వైపుకు వస్తున్నారు. ఈ క్రమంలో రాయపర్తి మండలం శివారులో మరో బైక్‌పై వచ్చిన దుండగుడు.. భవిత చేతిలోనుంచి బ్యాగును లాక్కెళ్లాడు. దుండగుడు గుర్తు పట్టలేని స్థితిలో ఉండడంతో ఆ దంపతులు రాయపర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత దంపతులు తమ కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా వర్ధన్నపేట మండలంలోని ఏకశిల స్కూల్‌లో చదువుకుంటున్న చిన్నారి వద్దకు వెళ్లి గిఫ్ట్‌గా తులం బంగారం చైన్ ఇచ్చారు. తిరిగి అదే చైన్‌ను బ్యాగులో భద్రపర్చి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. బ్యాగులో తులం బంగారం చైన్, పావు తులం బంగారం రింగు, రూ. 2వేల నగదు, సెల్ ఫోన్ ఉంది. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్టాపర్ బోర్డును ఢీకొన్న బైక్

- మహిళ మృతి
- ఛాగల్లులో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్: బైక్ అదుపు తప్పి స్టాపర్ బోర్డును ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ప్రమాదం మండలంలోని ఛాగల్లు వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ఒంగోలు జిల్లా కందుకూరు మండలం మాలకొండపాలేనికి చెందిన పిడుతల సునీత(35), శాంసన్ దంపతులు హనుమకొండ కోమటిపల్లి వద్ద కూలీ పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తమ బంధువు పల్లెపాటి యాకూబ్‌కు చెందిన బైక్‌పై ఆదివారం తెల్లవారుజామున స్వగ్రామం మాలకొండపాలెం వెళ్లేందుకు బయలుదేరారు. యాకూబ్ బైక్ నడుపుతుండగా సునీత, శాంసన్ వెనుక కూర్చున్నారు. యాకూబ్ బైక్‌ను వేగంగా నడుపుతూ ఛాగల్లులో జాతీయ రహదారిపై రోడ్డుపై పని జరిగే చోట ఏర్పాటు చేసిన స్టాపర్ బోర్డును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ముగ్గురు ఎగిరి రోడ్డుపై పడగా సునీతకు తీవ్రగాయాలు, యాకూబ్, శాంసన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ సునీత మృతి చెందింది. యాకూబ్, శాంసన్ చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థికి కరెంట్ షాక్

- అపస్మారక స్థితిలోకి 6వ తరగతి విద్యార్థి
- గుట్టుగా చికిత్స చేయించిన ఉపాధ్యాయులు
- కర్లపల్లి ఆశ్రమ పాఠశాలలో ఘటన



కరెంట్ షాక్ గురైన బాలుడు ముఖేష్



ములుగు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముఖేష్

గోవిందరావుపేట: ములుగు జిల్లా గోవిందరావుపేట మండల పరిధి కర్లపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న నీరేటి ముఖేష్ ఆదివారం ఆడుకుంటూ ఓ గదిలోని కిటికీని పట్టుకున్నాడు. కరెంట్ షాక్‌కు గురికావడంతో తోటి విద్యార్థులు కేకలు వేశారు. మరో విద్యార్థి ముఖేష్‌ను కర్రతో కొట్టగా షాక్ నుంచి బయట పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని ఉపాధ్యాయులు ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో హెచ్ఎం సెలవులో ఉండడం, ఏఎన్ఎం అందుబాటులో లేకపోవడం, విషయం బయటకు పొక్కకుండా చికిత్స చేయించడం అనుమానాలకు తావిస్తోంది. చివరకు విషయం తెలుసుకున్న బాలుడి తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకుని కొడుకుని చూసి కన్నీటిపర్యంతమయ్యారు.

చెవులకు కమ్మలు.. మెడలో మద్యం సీసా

- ముత్యాలమ్మకు కోడితో భక్తుడి మొక్కులు



చెవి కమ్మలు, మెడలో మద్యం సీసా అలంకరించిన కోడితో వెంకన్న

కేసముద్రం: కోడి చెవులకు కమ్మలు కుట్టించి, మెడలో మద్యం సీసా కట్టి మేళతాళాల నడుమ బోనాలతో బయలుదేరి ముత్యాలమ్మకు మొక్కులు చెల్లించుకున్న ఆసక్తికర సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. కేసముద్రంస్టేషన్‌కి చెందిన తోడేటి వెంకన్న తాను పెంచుకున్న కోడిపుంజు చెవులకు కమ్మలు, ముక్కుపుడక, దిద్దులు అలంకరించి, మెడలో మద్యం సీసా వేసి అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లాడు. గుడి చుట్టూ ప్రదక్షిణ అనంతరం మొక్కు చెల్లించుకున్నాడు. ఈ దృశ్యాన్ని భక్తులు ఆసక్తికరంగా తిలకించారు.

హైటెన్షన్ విద్యుత్ వైర్లు తెగి..

- నిలిచిన పద్మావతి ఎక్స్‌ప్రెస్



తెగిపడిన హైటెన్షన్ వైరు ముక్క



వంగాలపల్లి గేట్‌లో నిలిచిన పద్మావతి ఎక్స్‌ప్రెస్

చిల్పూరు: జనగామ జిల్లా చిల్పూర్ మండలం వంగాలపల్లి రైల్వేగేట్ సమీపాన ఆదివారం రాత్రి 9.12 గంటలకు హైటెన్షన్ లైన్ వైర్ తెగడంతో పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచింది. వివరాలు ఈవిధంగా ఉన్నాయి.. తిరువనంతపురం నుంచి తిరుపతి వెళ్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ వంగాలపల్లి గేట్ వద్దకు చేరుకునే సరికి హైటెన్షన్ లైన్ వైర్లు షార్ట్ సర్క్యూట్‌తో తెగిపడడంతో విద్యుత్ సరఫరా ఆగి రైలు ఒక్కసారిగా గేట్‌లోనే నిలిచింది. అయితే ప్రయాణికులు సురక్షితంగా ఉన్నట్లు ఓ రైల్వే ఉద్యోగి తెలిపారు. ఇది చాలా అరుదుగా జరుగుతుందని పేర్కొన్నారు. విషయం తెలియగానే కాజీపేట నుంచి వచ్చిన సిబ్బంది తెగిన వైర్ల స్థానంలో కొత్తవి అమర్చారు. 21 నిమిషాల తదుపరి రైలు కాజీపేటకు వెళ్లింది.